సాక్షి
పెద్దపల్లి
బుధవారం ǀ 12 ǀ మార్చి ǀ 2025



కల్యాణం.. కమనీయం

కాల్వశ్రీరాంపూర్: మల్యాల శ్రీవిశ్వేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం శివ పార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిపించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



జీడీకే -5 ఓసీపీ సందర్శన

గోదావరిఖని: జీడీకే-5 ఓసీపీ, స్టోర్స్‌ను కార్పొరేట్ సేఫ్టీ జీఎం శ్రీనివాస్, స్టోర్స్ జీఎం ఎలీషా మంగళవారం సందర్శించారు. పలు సూచనలు చేశారు. అధికారులు వారివెంట ఉన్నారు.



	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.27	5.06
పెద్దపల్లి :	6.31	5.05
సిరిసిల్ల :	6.26	5.15
జగిత్యాల :	6.31	5.05

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం పెట్టాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదివే బాల, బాలికలకు నాణ్యమైన భోజనం అందించాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. రంగంపల్లిలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలికల గురుకులాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. వసతులపై ఆరా తీశారు. డార్మెంటరీ, క్లాస్‌రూం, డైనింగ్‌హాల్, వంటగది, స్టోర్‌రూంలను తనిఖీ చేశారు. నాణ్యమైన కూరగాయలు, పండ్లు ఇవ్వాలని అన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మంచి ఫలితాలు వచ్చేలా ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ మణిదీప్తి, ఉపాధ్యాయినులు ఉన్నారు.

భద్రత, శ్రేయస్సు కీలకం



బహుమతి అందిస్తున్న చందన్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): పరిశ్రమ భద్రత, కార్మికులు, ఉద్యోగుల శ్రేయస్సు కీలకమని తెలంగాణ ప్రభుత్వ కరీంనగర్ ఫ్యాక్టరీల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు పరిపాలనా భవనంలో మంగళవారం జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంతతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తి భేషుగ్గా ఉందన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. పలు పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. జనరల్ మేనేజర్లు అలోక్ కుమార్ త్రిపాఠి, అంజనా రంజన్ దాస్, సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ ముకేశ్‌కుమార్, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, అధికారులు బెహెకర్, సుప్రకాశ్ చక్రవర్తి పాల్గొన్నారు.

పంపు సెట్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎస్ఈ

రామగిరి(మంథని): రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యమైన కెపాసిటర్లు అమర్చుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ మాధవరావు సూచించారు. కల్వచర్ల, బుధవారంపేట(రామయ్యపల్లి)లో మంగళవారం పొలంబాట చేపట్టారు. కల్వచర్లలో ఓవర్‌లోడ్ నియంత్రణకు 100 కేవీ సామర్థ్యంగల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. కెపాసిటర్లు బిగిస్తే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు నియంత్రణలోకి వస్తాయన్నారు. విద్యుత్ మోటార్లపై భారం పడదని తెలిపారు. మంథని డివిజన్ ఏఈ ప్రభాకర్, ఏడీఈ కనకయ్య, ఏఈ మహేందర్, సబ్ ఇంజినీర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డు తనిఖీ చేస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

జూలపల్లి(పెద్దపల్లి): గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులపై శ్రద్ధవహించాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. వెంకట్రావుపల్లె, కాచాపూర్‌లో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెగ్రిగేషన్ షెడ్లు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా తీరు పరిశీలించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు సాగర్‌రావు, రేవతి పాల్గొన్నారు.

క్వింటాలు పత్తి రూ.6,866

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,866 ధర పలికింది. కనిష్ఠంగా రూ.5,003గా, సగటు రూ.6,455గా ధర నమోదైందని మార్కెట్ సెక్రటరీ మనోహర్ తెలిపారు. రైతుల నుంచి 525 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగ్గు పోస్తున్నారు..

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం
- పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు
- లబ్ధిదారుల్లో ఆశలు రేకెత్తిస్తున్న ప్రారంభోత్సవాలు
- జిల్లాకు 10,500 ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు
- ఇప్పటివరకు 800 ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



నిట్టూరులో ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోశాక లబ్ధిదారుకు ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్

సాక్షి, పెద్దపల్లి: పేదల దశాబ్దాల సొంతింటి కల సాకారమయ్యేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి.. జిల్లావ్యాప్తంగా సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల శంకుస్థాపనలు పేద కుటుంబాల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. గతఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నేతలు పేదల సొంతింటి కల నెరవేర్చుతామని, ఇందుకోసం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. అంతేకాదు.. తమ ఎన్నిక ల మేనిఫెస్టోలోనూ చేర్చి ప్రచారం విస్తృత పర్చారు.

తొలుత మోడల్ ఇళ్ల నిర్మాణం..

జిల్లాలో తొలుత మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లోని ఒక్కో గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి, ఓదెల మండలంలోని శానకొండ, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని అంకంపల్లి, పెద్దపల్లిలోని నిమ్మనపల్లి గ్రామాల్లో మోడల్ ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఆయా ప్రాంతాల్లోని కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణాలకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముగ్గు పోస్తున్నారు.

అద్దె కొంపలు.. అనేక అవస్థలు

జిల్లాలోని వేలాది పేద కుటుంబాలు ఇంకా అద్దె కొంపల్లోనే అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 7,91,836 ఉండగా, ఇందులో 3,97,585 మంది పురుషులు, 3,94,251 మంది మహిళలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలోని గోదావరిఖని మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, 13 మండలాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోంచి తమకు ఇందిరమ్మ ఇళ్లు కావాలంటూ ప్రజాప్రజాలన సభలు, ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి 1,80,564 దరఖాస్తులు అందాయి.

ప్రయోగాత్మక గ్రామాల్లో లబ్ధిదారులు..

మద్దిర్యాల	59	మచ్చుపేట	20
బంజేరుపల్లి	71	శానగొండ	200
శివపల్లి	08	రామారావుపల్లి	110
కోనరావుపేట	140	నిమ్మనపల్లి	130
రొంపికుంట	170	రత్నాపూర్	290
అడవి సోమన్పల్లి	180	అంకంపల్లి	110
		కాట్నపల్లి	120

భారంగా బతుకులు..

పల్లెల్లోనూ ప్రస్తుతం ఒక బెడ్రూమ్ ఇంటి అద్దె కనీసం రూ.2వేల నుంచి రూ.3వేల వరకు పలుకుతోంది. అయినా, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటగదులు, నీటి సౌకర్యం సరిగా ఉండడంలేదు. మున్సిపాటీల్లో ఇదే ఇంటికి రూ.5వేల నుంచి రూ.7 వేల వరకు అద్దె పలుకుతోంది. ఇక్కడా ఇరుకు గదులు, అసౌకర్యాలు, నీటి వసతి ఉండడంలేదు. ఇక గోదావరిఖనిలో అయితే, సింగిల్ బెడ్రూమ్ అద్దె రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోంది. అపార్ట్‌మెంట్లలో అయితే ఇంతకు రెట్టింపు పలకడంతో పేదలు, సామాన్యులు ఆ ఇళ్లలో ఉండే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో స్లమ్ ఏరియాల్లోని అరకొర వసతులు ఉన్నా సర్దుకు పోతున్నారు. కూలీనాలీ పనులు చేసుకునే రోజూవారీ కూలీలు.. నెలకు సంపాదించే ఆదాయంలో అగ్రభాగం ఇంటి అద్దెకే వెచ్చించాల్సి వస్తోందని వాపోతున్నారు.

నియోజవర్గానికి 3,500 ఇళ్ల కేటాయింపు..

తొలిదశలో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారు. జిల్లాలో పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో కేటాయించే 10,500 ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలు తలదాచుకునేందుకు ఆశ్రయం లభిస్తుందనే గంపెడాశతో ఎదురు చూస్తున్నాయి. జిల్లాకు తొలిదశలో గత జనవరి 26వ తేదీన 1,708 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు 800 ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వానికి 1,80,564 దరఖాస్తులు అందినట్లు అధికారులు వివరిస్తున్నారు.

మహిళలకు నైపుణ్య శిక్షణ

- త్వరలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, వేదికపై అధికారులు

పెద్దపల్లిరూరల్: స్వశక్తి సంఘాల మహిళలు వ్యాపార రంగంలో రాణించేలా అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు వీలుగా వీ హబ్ సహకారంతో జిల్లాలో మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు. వ్యాపారాభివృద్ధిపై కలెక్టరేట్‌లో మంగళవారం స్వశక్తి మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. ఆహార, ఉత్పత్తి, హస్తకళలు, టెక్స్‌టైల్ లాంటి రంగాల్లో శిక్షణ ఇస్తామని, యువత తమ ఆలోచనలను ఉన్నతంగా ఎంచుకుంటే వీ హబ్ ద్వారా సేవలు అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వీ హబ్ డైరెక్టర్లు జహీద్ అక్తర్ షేక్, ఊహ, డీఆర్డీవో కాళిందిని, ప్రతినిధులు సాయిరాం, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తికాంత్, ప్రిన్సిపాల్ మురళి, ఉష తదితరులు ఉన్నారు. కాగా, కుంగ్‌ఫూ కరాటే జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ శ్రీహర్ష ఈ సందర్భంగా అభినందించారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమాయోజన పథకం కింద ఇండియా పోస్ట్ పేమెంట్ బాంకు ద్వారా రూ.436 ప్రీమియం చెల్లించి రూ.2లక్షల బీమా పొందవచ్చని కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును కలెక్టర్ బాధితులకు అందజేశారు. రెండేళ్లలో 20మంది బీమా క్లెయిమ్ చేశారని ఆయన తెలిపారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, ఇండియా పోస్ట్‌పేమెంట్ సీనియర్ మేనేజర్ కొట్టె శ్రీనివాస్, మేనేజర్ మోహన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం పనిచేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నియోజకవర్గంలోని 86మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ (రూ.86.60లక్షలు), 471మందికి సీఎంఆర్ఎఫ్ (రూ.కోటి 27 లక్షల) విలువైన చెక్కులను జిలాల కేంద్రంలో మంగళవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే అభివృద్ధి వైపు అడుగులేస్తున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకశ్రద్ధ చూపారని అన్నారు. ఇళ్లులేని పేదల గురించి గత పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య, నాయకులు సుమన్ రెడ్డి, సంపత్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, రాజేందర్, రామ్మూర్తి, శంకర్, సురేందర్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు

సుల్తానాబాద్(పెద్దపల్లి): త్వరలోనే అన్ని గ్రామాలు, పట్టణాల్లోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 38 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.38,04,408 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. 6, ఏడో వార్డుల్లో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు దశలవారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, మున్సిపల్ కమిషనర్ నియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్‌విండో ఇన్‌చార్జి శ్రీగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి

ఓదెల(పెద్దపల్లి): సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలు అద్దంలా మెరుస్తున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఓదెల, ఇందుర్తిలో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీల పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నాయకులు ఆళ్ల సుమన్ రెడ్డి, మూల ప్రేంసాగర్‌రెడ్డి, గోపు నారాయణరెడ్డి, చీకట్ల మొండయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాన్ అసోసియేషన్ ఆఫీసు ప్రారంభం

మండల కేంద్రంలోని వ్యాన్ అసోసియేషన్ ఆఫీసును ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు.

కొత్త గనులతోనే మనుగడ

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: కొత్త బొగ్గు గనులు వస్తేనే సింగరేణికి మనుగడ ఉంటుందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జీడీకే-11గనిపై మంగళవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత గనులు మరో పదేళ్లలో మూతపడతాయని, కొత్త గనుల కోసం సింగరేణి వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఆయన కోరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిపడ్డ రూ.33 వేల కోట్లను వెంటనే చెల్లించాలని విన్నవించామని ఆయన వెల్లడించారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో కార్మికుల్లో వ్యతిరేకత వచ్చి కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదని అన్నారు. నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోశం, రాజు, మహేశ్, రంగు శ్రీను, ఎస్.వెంకట్‌రెడ్డి, నాయిని శంకర్ పాల్గొన్నారు.

యంత్రాలను వినియోగించాలి



యంత్రాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

గోదావరిఖని: బొగ్గు ఉత్పత్తి కోసం యంత్రాలను వినియోగిస్తూ నిర్దేశిత లక్ష్యం సాధించాలని సింగరేణి ప్రాజెక్టు, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆర్జీ-2ఏరియా వకీల్‌పల్లి గనిని మంగళవారం ఆయన సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, యంత్రాల మరమ్మతులు పరిశీలించారు. బంకర్ రిపేర్ పనులు తనిఖీ చేశారు. సకాలంలో బొగ్గు రవాణా చేయాలని సూచించారు. వెంకటేశ్వర్లును జీఎం వెంకటయ్య, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ నెహ్రూ, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, మేనేజర్ రవికిరణ్, ఏజీఎం ఎర్రన్న, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

- కమిషనరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
- సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటే వేటు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: 'గంజాయి, డ్రగ్స్‌ను కూకటివేళ్లతో పెకిలించి వేస్తాం. ఇందుకోసం కమిషనరేట్ కేంద్రంగా ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తాం. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకునే పోలీసులపై వేటు వేస్తాం. నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తాం' అని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు. మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ వివరాలు..

సాక్షి: నేరాలను ఎలా నియంత్రిస్తారు?
సీపీ: బదిలీపై రామగుండం రావడం సంతోషంగా ఉంది. రామగుండం చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం ఉంది. దీంతో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా ముందుకు సాగుతాం.

సాక్షి: గంజాయి రవాణా, విక్రయాలను ఎలా అరికడతారు?
సీపీ: గంజాయి రవాణా పెరిగినట్లు సమాచారం ఉంది. పాత నేరస్తులపై నిఘా ఉంది. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం. విక్రయదారులు, తాగేవారిపైనా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

సాక్షి: డ్రగ్స్ నివారణకు ప్రత్యేక ప్రణాళిక ఏమైనా ఉందా?
సీపీ: గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు 15 మందితో సిటీడ్రగ్స్ కంట్రోల్ టీం ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక ఫోన్ నంబర్ అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ నంబరుకు సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

సాక్షి: పాత నేరస్తులు, భూమాఫియాపై..?
సీపీ: పాతనేరస్తులు, భూమాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటాం. సెటిల్‌మెంట్ల విషయంలో జోక్యం చేసుకుంటే పోలీసులపై కఠిన చర్యలు ఉంటాయి. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తేలేదు.

సాక్షి: రోడ్డు ప్రమాదాలను ఎలా నియంత్రిస్తారు?
సీపీ: వరంగల్ సీపీగా పనిచేస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలతో 20 శాతం ప్రమాదాలు తగ్గాయి. బ్లాక్‌స్పాట్ల వద్ద దృష్టి సారిస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడతాం.

సాక్షి: పోలీసులకు మీరిచ్చే సూచనలేమిటి?
సీపీ: శాంతిభద్రతల పరిరక్షణలో పకడ్బందీగా వ్యవహరించాలి. ఫిర్యాదుదారులకు అందుబాటులో ఉండాలి. ఉదయం, సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఉండి ఫిర్యాదులు స్వీకరించాలి. వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఉంటే సహించేదిలేదు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకునే వారిపైనా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: సైబర్‌నేరాలను ఎలా నియంత్రిస్తారు?
సీపీ: సైబర్‌నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. అపరిచితులు, అపరిచిత ఫోన్ నంబర్లకు సమాధానం ఇవ్వవద్దు. బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయొద్దు.

సాక్షి: ప్రజల నుంచి ఎలాంటి సహకారం ఆశిస్తున్నారు?
సీపీ: చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇలాంటి వారి వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. మత్తుపదార్థాల విక్రయాలను అరికట్టేందుకు సహకారించాలి. సమస్యల పరిష్కారానికి పోలీసులను ఆశ్రయించాలి. న్యాయం జరగకుంటే నేరుగా నన్ను సంప్రదించాలి.

సాక్షి: యువతకు మీరిచ్చే సందేశం ఏమిటి?
సీపీ: గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. నిరుద్యోగ యువతను చేరదీసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే ఉట్నూర్ ఐటీడీఏ సహకారంతో గతంలో యువతకు శిక్షణ ఇప్పించి అగ్రగామిగా తీర్చి దిద్దాం. ఇక్కడ కూడా యువతకు ఉపాధి శిక్షణ, కాంపిటీటివ్ పరీక్షల్లో తర్ఫీదు, కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో శిక్షణ ఇస్తాం. ఇంటర్వ్యూలలో నెగ్గేలా తీర్చిదిద్దుతాం. క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం.

అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



షాపింగ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభిస్తున్న ఠాకూర్

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలో మంగళవారం సింగరేణి షాపింగ్ కాంప్లెక్స్ పనులను ప్రారంభించారు. ప్రధాన కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, బొందలగడ్డలా మారుతున్న ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం, సింగరేణి సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆక్రమిత సింగరేణి స్థలాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. కూరగాయల మార్కెట్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతామని అభయం ఇచ్చారు. వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాగూర్, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, నాయకులు మహంకాళిస్వామి, బొంతల రాజేశ్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతాం

కోల్‌సిటీ(రామగుండం): ఆధునిక యంత్రాలతో పారిశుధ్య పనులు చేపట్టి రామగుండాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రూ.76 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన రెండు బ్యాక్ హో లోడర్ యంత్రాలతో పాటు రూ.4.70 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 8 హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలను కమిషనర్ అరుణశ్రీతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారులు రామన్, నాగభూషణం, కుమారస్వామి, నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్, ముస్తఫా, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

బాధితురాలికి చేయూత

రామగుండం: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అంతర్గాం మండలం ఆకెనపల్లికి చెందిన నంది లావణ్య వైద్యం కోసం ఎమ్మెల్యే ఠాకూర్ రూ.4 లక్షల ఎల్‌వోసీ ఇప్పించారు. రామునిగుండాల కొండపై చేపట్టిన శ్రీఆంజనేయస్వామి విగ్రహం ఎదుట ఎమ్మెల్యే దంపతులు పూజలు చేశారు. 150 అడుగుల ఎత్తుతో చేపట్టిన పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులు పర్యవేక్షించారు.

ఖమ్మంపల్లి - భూపాలపల్లి రోడ్డుకు రూ.33.70 కోట్లు



ఖమ్మంపల్లి - భూపాలపల్లి రోడ్డు ఇదే..

ముత్తారం(మంథని): పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాను కలిపేందుకు ముత్తారం మండలం ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మంగళవారం రూ.33.70కోట్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వంలో అటవీశాఖ అనుమతి రాక రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు ఆగిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు చొరవతో జీవో నంబరు 113 ద్వారా నిధులు మంజూరు చేయించారు. ఈ రోడ్డు నిర్మాణంతో మంథని, ఖమ్మంపల్లి నుంచి భూపాలపల్లికి సుమారు 20 కిలోమీటర్ల వరకు దూర భారం తగ్గుతుంది. ఖమ్మంపల్లి, తాడిచెర్ల వంతెన నిర్మాణం పూర్తయినా.. భూపాలపల్లి వరకు ప్రయాణం చేయడానికి రోడ్డు సౌకర్యంలేక వాహనాదారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఖమ్మంపల్లి నుంచి తాడిచెర్ల నాగులమ్మ, కాటారం నుంచి వెళ్లేవారు. ప్రస్తుతం ఖమ్మంపల్లి - భూపాలపల్లి మధ్య రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరావడంతో తమ ఇబ్బందులు తొలగుతాయని స్థానికులు సంబురపడుతున్నారు.

క్లుప్తంగా

కాలువలోపడి వ్యక్తి మృతి


మానాల వెంకటేశ్(ఫైల్)

గోదావరిఖని: మల్కాపూర్ గ్రామానికి చెందిన మానాల వెంకటేశ్(47) మంగళవారం ప్రమాదవశాత్తు మురుగునీటికాలువలోపడి మృతి చెందాడని వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఉదయం పని కోసం స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య


అంజయ్య మృతదేహం

మానకొండూర్: మండలంలోని పోచంపల్లికి చెందిన పొలం అంజయ్య (53) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొలం అంజయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి 15 ఏళ్ల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి అంజయ్య ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. కుటుంబ సభ్యులు అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు పలు ఆస్పత్రులు తిరిగి వైద్యం చేయించారు. రెండు నెలలనుంచి మళ్లీ అంజయ్య ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున అంజయ్య ఇంట్లో కనిపించకపోవడంతో కుమారుడు రఘు తండ్రి కోసం వెతకగా ఇంటి ముందు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో ఒకరు..


నర్సింహాచారి (ఫైల్)

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ శివారు భూషణగట్ల వద్ద బండోజు నర్సింహాచారి(50) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సైదాపూర్ ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం .. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నర్సింహాచారి అనారోగ్య సమస్యలతో జనవరి 7న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్సకు సుమారు రూ.5లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలని మనస్తాపం చెందాడు. ఆ మర్నాడు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నర్సింహాచారి కనిపించడం లేదని హుస్నాబాద్ పోలీసులకు ఆయన కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండలం ఆకునూర్ శివారు భూషణగట్ల వద్ద చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడని సర్వాయిపేట గ్రామానికి చెందిన దేవయ్య మంగళవారం ఇచ్చిన సమాచారంతో కుటుంబసభ్యులు నర్సింహాచారి మృతదేహంగా గుర్తించారు. నర్సింహాచారికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. చిన్న అల్లుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్వరంతో బాలిక మృతి


రమ్య (ఫైల్)

హుజూరాబాద్ : మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి రమ్య (14) తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రమ్య గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 20 రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా హన్మకొండలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం రాత్రి తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. రమ్య తండ్రి బండారి పెద్ద రమేశ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.


స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్

కల్యాణం.. కమనీయం

- పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ అడ్లూరి..
- జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్
- హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రముఖులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణవేడుకలను అశేషభక్తుల మధ్య మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు స్వామివారి కల్యాణ వేడుకలను ఉదయం నుంచే ప్రారంభించారు. రాష్ట్రనలుమూలలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో శ్రీమఠంస్థలం కిక్కిరిసి పోయింది. స్వామివారలకు ప్రభుత్వం తరఫున స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఇసుక స్తంభం నుంచి దేవాలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. ముందుగా ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించారు. వేడుకల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




వేడుకను తిలకిస్తున్న భక్తులు


పట్టువస్త్రాలు తెస్తున్న కలెక్టర్ దంపతులు


పట్టు వస్త్రాలతో విప్ అడ్లూరి లక్ష్మణ్

పేకాట.. వసూళ్లు

- వాహనాలు, సెల్‌ఫోన్ల అప్పగింత పేరిట
- లంచాలకు తెరతీస్తున్న పోలీసులు


పేకాట ఆడుతున్న వ్యక్తులు

కోరుట్ల: పేకాటలో దొరికిన డబ్బుల్లో కొంత నొక్కేయడం అక్కడక్కడ షరామాములుగా మారింది. అడిగితే ఇన్‌ఫార్మర్‌కు కొన్ని డబ్బులు ఇచ్చామని పైఅధికారులకు సర్ది చెప్పడం తెలిసిందే. మరికొందరు పోలీసు సిబ్బంది అత్యుత్సాహం చూపుతూ.. పేకాటరాయుళ్ల వాహనాలు, సెల్‌ఫోన్లను అప్పగించడానికి ఎంతోకొంత మామూళ్లు వసూలు చేస్తున్న వైనం బహిరంగ రహస్యమే అయినా ఈ వ్యవహారం గత బుధవారం కోరుట్లలో ఏసీబీకి చిక్కిన ఎస్సై తీరుతో వెలుగులోకి వచ్చింది. పేకాట ఆడేవారి సంఖ్యను బట్టి ఒక్కోసారి ఎంత తక్కువ అనుకున్నా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూళ్ల దందా సాగుతోందంటే అతిశయోక్తి కాదు.

వాహనాలు.. సెల్‌ఫోన్లు

జగిత్యాల జిల్లాలోని రాయికల్, మల్యాల, మల్లాపూర్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, కొడిమ్యాల, కోరుట్ల, మల్యాల తదితర మండలాల్లో పేకాట జోరుగా సాగుతున్న క్రమంలో కొన్నిచోట్ల స్థానిక పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించడం లేదని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేసి పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు నెలల వ్యవధిలో జిల్లాలో సుమారు 11 చోట్ల పేకాట రాయుళ్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. వీటిలో స్పెషల్ పార్టీ పోలీసులు పట్టుకున్న కేసులే ఎక్కువగా ఉన్నాయి. పేకాటరాయుళ్లను పట్టుకున్న సందర్భంలో డబ్బులతోపాటు వారి వాహనాలు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు పేకాటరాయుళ్లను పట్టుకున్నా స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనే అప్పగిస్తారు. ఇలా స్థానిక పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇదే సాకుగా..

వాస్తవానికి పేకాటరాయుళ్ల వాహనాలు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదని సమాచారం. కొన్ని సందర్భాల్లో ఎంవీఐ యాక్ట్ -207 ప్రకారం వాహనాలు, సెల్‌ఫోన్లను సీజ్ చేసే అవకాశముంది. పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీసు అధికారి విచక్షణాధికారం ప్రకారం నిర్ణయం తీసుకునే అవకాశముంది. కానీ.. పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాలు, సెల్‌ఫోన్లు వదిలేస్తే మళ్లీ కోర్టుకు హాజరుపర్చడంలో ఇబ్బందులు వస్తున్నాయి. చాలామంది కోర్టుకు రమ్మంటే రావడం లేదు. ఈ కారణంగా పోలీసులు పేకాటరాయుళ్లను పట్టుకున్న అనంతరం నిందితులను కోర్టుకు హాజరుపరిచే వరకు సెల్‌ఫోన్లు, వాహనాలు పోలీస్‌స్టేషన్లలో ఉంచుకుంటున్నారు. ఇదే సాకుగా కొంత మంది కింది స్థాయి సిబ్బంది వాహనాలు, సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చే సాకుతో కాసుల వసూళ్ల దందాకు తెర లేపుతున్నారు. ఇలా పేకాటలో దొరికిన చాలామంది వద్ద పోలీసులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కోరుట్ల ఎస్సై పేకాట ఆడి పట్టుబడిన ఓ వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసే క్రమంలో ఏసీబీకి చిక్కడం గమనార్హం.

నేటి నుంచి డోలోత్సవం


ఏర్పాటు చేస్తున్న యాగశాల

వేములవాడ: రాజన్న ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ తెలిపారు. ఈనెల 16 నుంచి ఐదు రోజులపాటు జరిగే శివకల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రధానాలయం ముందు యాగశాల సిద్ధం చేస్తున్నారు.

ఇన్‌చార్జి స్థానాచార్యులుగా ఉమేశ్‌శర్మ

రాజన్న ఆలయం ఇన్‌చార్జి స్థానాచార్యులుగా ఉమేశ్‌శర్మను నియమించినట్లు ఈవో కొప్పుల వినోద్ రెడ్డి తెలిపారు. గతనెలలో ఇనచార్జి స్థానాచార్యులుగా కొనసాగిన అప్పాల భీమాశంకరశర్మ రిటైర్డ్ కావడంతో ఏర్పడిన ఖాళీలో ప్రధాన అర్చకులైన ఉమేశ్‌శర్మ నియమించారు.

నలుగురు బాలికల అదృశ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన వన్‌టౌన్ పోలీసులు

కరీంనగర్ క్రైం: నగరానికి చెందిన నలుగురు బాలికలు రెండు రోజుల క్రితం అదృశ్యం అయ్యారు. వారి జాడ గుర్తించిన కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు క్షేమంగా ఇంటికి చేర్చారు. ఈ నెల 09న వన్‌టౌన్ పోలీసులకు నలుగురు బాలికలు అదృశ్యం అయ్యారని ఫిర్యాదు వచ్చింది. దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరులో బాలికలను గుర్తించి కరీంనగర్ తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. బాలికలు తరచూ ఫోన్లు చూస్తుండడంతో మందలించడంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సిరిసిల్లక్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య (59) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. రాజయ్య సైకిల్‌పై వెల్జిపూర్ వెళ్తుండగా సిరిసిల్ల బ్రిడ్జి వద్ద వెనకనుంచి బైక్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజయ్యను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రి, అక్కడి నుంచి కరీంనగర్ తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి చిన్న కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన శీతల్లి మనోహర్‌ను నిందితుడిగా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

శంకరపట్నం: శంకరపట్నం మండలంలో వీధికుక్కల దాడిలో మరో బాలుడికి తీవ్రగాయాలు అయ్యాయి. మండలంలోని వంకాయగూడెం గ్రామానికి చెందిన శ్రేయాన్స్(4) ఇంటిఎదుట ఆడుకుంటుండగా వెన్నులో కుక్క కరిచి గాయపర్చింది. తాడికల్‌లో కృత్విక్‌ను కరిచిన కుక్క వంకాయగూడెం వచ్చి శ్రేయాన్స్‌ను కరిచిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శ్రేయాన్స్‌కు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసు ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద రూ.3000 విలువైన 1.460 కిలోల గంజాయి చాక్లెట్లు లభించినట్లు వెల్లడించారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహేశ్‌కుమార్ గౌతమ్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

265 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

ధర్మారం(ధర్మపురి): నర్సింహులపల్లి గ్రామశివారులో మంగళవారం లారీలో అక్రమంగా తరలిస్తున్న 264.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ టీంతోపాటు పెద్దపల్లి సీఎస్ఐ శ్రీనివాస్ సంయుక్తంగా నర్సింహులపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అటుగా వచ్చిన లారీని ఆపి సోదా చేయగా.. దాదాపు రూ.పది లక్షల 32వేల 330 విలువైన 267.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించాయని పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పెద్దపల్లి ఆర్ఐ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న మొటం గురువయ్య, ముగ్గ శ్రీనివాస్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు.

లే నాన్నా.. అమ్మా, చెల్లి వచ్చాం

- లిఫ్ట్ ప్రమాదంలో సిరిసిల్ల కమాండెంట్ మృతి
- తండ్రి మృతదేహాన్ని చూసి విలవిల్లాడిన కూతురు
- కలెక్టర్, ఎస్పీ నివాళి
- సంతాపం తెలిపిన కేంద్ర మంత్రి బండి, మాజీ మంత్రి కేటీఆర్


గంగారాం(ఫైల్)

సిరిసిల్ల/సిరిసిల్లక్రైం: 'లే నాన్న.. అమ్మా.. చెల్లి వచ్చాం.. ఒక్కసారి చూడండి నాన్న.. మీరే మా ధైర్యం .. ఇలా వెళ్లి పోతే ఎలా.. మీకు ఎన్ని గాయాలు అయ్యాయి.. నాన్న పడిపోతుంటే.. మీరంతా ఉండి ఏం చేస్తున్నారు..!! అంటూ.. సిరిసిల్లలో ప్రమాదవ శాత్తు మృతిచెందిన 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం(61) కూతురు డాక్టర్ గౌతమి కన్నీరు కార్చుతూ విలవిలాడిపోయారు. వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావునగర్‌లో రమేశ్ ఇంట్లో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అద్దెకు ఉంటారు. చంద్రశేఖర్‌రెడ్డి కూతురు ఇటీవల మరణించారు. అతన్ని ఓదార్చేందుకు వారి ఇంటికి వెళ్లిన తోట గంగారాం తిరిగి వస్తుండగా.. లోపల లిఫ్ట్ లేకుండానే గేటు ఓపెన్ కావడంతో అందులో ప్రమాదశాత్తు పడిపోయాడు. మూడో అంతస్తు నుంచి గంగారాం పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది తాళ్ల సాయంతో గంగారాంను బయటకు తీయగా అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. లిఫ్ట్ నిర్వహణ లోపమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు సిద్దిపేటకు చెందిన లిఫ్ట్ నిర్మాణ సంస్థ ప్రతినిధిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల శివారులోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ మృతదేహాన్ని ఉంచి పలువురు నివాళులు అర్పించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ బెటాలియన్‌కు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అంతకు ముందు రాత్రి ఎస్పీ గిటే మహేశ్ బాబా సాహేబ్, ఏఎస్పీ చంద్రయ్య గంగారాం మృతదేహాన్ని పరిశీలించి నివాళి అర్పించారు. గతంలో హైదరాబాద్ సచివాలయం ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీస్(సీఎస్‌వో) గా గంగారాం పని చేశారని, ఆయన మృతిపట్ల సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె.తారక రామారావు సంతాపం తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ పోలీస్ కమాండెంట్ మృతిపై సంతాపం ప్రకటించారు. బెటాలియన్ పోలీస్ సిబ్బంది కన్నీటి నివాళి మధ్య గంగారాం మృతదేహాన్ని స్వగ్రామం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులంకు తరలించారు.


గంగారాం మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పరీక్ష రాస్తే విజయమే

తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1, 2 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సత్తాచాటారు. కొందరు అభ్యర్థులు ఇదివరకు గ్రూప్-4 ఫలితాల్లో ర్యాంకులు సాధించి ఆయా శాఖల్లో ఉద్యోగం చేస్తున్నారు. మళ్లీ ఇప్పుడు ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం.

- వీఆర్వోగా, జూనియర్ అసిస్టెంట్‌గా రాణించిన దివ్య
- గ్రూప్ -2లో ప్రతిభ


దివ్య

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ - 2 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మోటపల్లి దివ్య రాష్ట్రస్థాయిలో 169వ ర్యాంక్ సాధించారు. కాళేశ్వరం జోన్ మహిళా విభాగంలో రెండో ర్యాంక్ సాధించారు. బంగారు ఆభరణాల పనిచేసే మోటపల్లి తిరుపతి-భారతి దంపతుల కూతురు దివ్య. బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ చదివారు. 2019లో వీఆర్వోతోపాటు గ్రూప్ - 4 ఉద్యోగం కోసం నిర్వహించిన పరీక్ష రాశారు. తొలుత వీఆర్వో ఉద్యోగానికి ఎంపికయ్యారు. జూలపల్లి మండలంలో పనిచేశారు. గ్రూప్- 4 పరీక్ష ఫలితాలు 2021లో ప్రకటించగా రాష్ట్రస్థాయిలో 47వ ర్యాంక్ సాధించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యారు. 317 జీవో కింద దివ్యను ధర్మారం తహసీల్దార్ కార్యాలయానికి జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. గ్రూప్ - 1 లక్ష్యంగా ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టిన ఆమె.. రెండు నెలల వ్యవధిలోనే గ్రూప్ -2, గ్రూప్ -1 పరీక్షలు నిర్వహించగా రెండింటికి ప్రిపేరయ్యారు. మంగళవారం విడుదలైన గ్రూప్- 2 ఫలితాల్లో సత్తాచాటారు.

సన్మానించిన తహసీల్దార్

ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యను మంగళవారం తహసీల్దార్ వకీల్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. దివ్యను శాలువాతో సన్మానించి మిఠాయిలు పంపిణీ చేశారు. తహసీల్దార్ వకీల్, డిప్యూటీ తహసీల్దార్ కుమార్, ఆర్ఐలు వరలక్ష్మి, నవీన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-4లో 26, ఇప్పుడు 24వ ర్యాంక్


రాకేశ్‌గౌడ్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేశ్‌గౌడ్ గ్రూప్- 2 ఫలితాల్లో 24వ ర్యాంకు సాధించాడు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని రాకేశ్ తెలిపాడు. మూడు నెలల క్రితం ప్రకటించిన గ్రూపు- 4 ఫలితాల్లో 26వ ర్యాంకు సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషనరీ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాకేశ్ ప్రాథమిక విద్యాభ్యాసం ఇల్లంతకుంట మండల కేంద్రంలో, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. రెవెన్యూ, మున్సిపల్, కమర్షియల్ అండ్ టాక్సెస్ శాఖల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాకేశ్ తండ్రి యాదగిరిగౌడ్ వ్యవసాయం, మోటార్ వైండింగ్ పనులు చేస్తారు.

సత్తాచాటిన భువన


భువన

సిరిసిల్లఎడ్యుకేషన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బుర్ర భువన గ్రూప్-1లో 456 మార్కులు, గ్రూప్-2లో 363 ర్యాంకు సాధించింది. గతంలో తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-4లో ఎంపికై ప్రస్తుతం కలెక్టరేట్‌లోని ల్యాండ్ అండ్ రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. చొప్పదండి జవహర్ నవోదయ పాఠశాలలో చదివి 10జీపీఏ సాధించి, అనంతరం ఎస్ఆర్ కళాశాల హనుమకొండలో ఇంటర్ పూర్తి చేసింది. ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ పూర్తి చేసి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో మూడేళ్లు అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగానికి రాజీనామా చేసింది. గ్రూప్స్ కోసం చదివి ప్రస్తుతం మెరుగైన ఫలితాన్ని సాధించడంపై కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు. భువన తండ్రి బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా తల్లి ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తుంది.

నిఖిల్‌రెడ్డికి 70వ ర్యాంక్


నిఖిల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): గ్రూప్-2 మెరిట్‌లిస్టులో సైదాపూర్ మండలానికి చెందిన సంతపురి నిఖిల్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 70వ ర్యాంకు సాధించారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంతపురి నాగిరెడ్డి, జ్యోతి కొడుకు నిఖిల్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన నిఖిల్‌రెడ్డి ఏ విధమైన కోచింగ్ లేకుండానే ఇంటి వద్దనే సొంతంగా పరీక్షలకు సన్నద్ధమై తొలుత గ్రూప్-4లో పోలీస్‌శాఖలో, రెండోసారి గ్రూప్-4లో ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. మంగళవారం విడుదలైన గ్రూప్-2లో 398.423 మార్కులతో రాష్ట్రస్థాయిలో 70ర్యాంకు సాధించాడు.

సాయిప్రశాంత్‌రెడ్డికి 95వ ర్యాంకు


సాయిప్రశాంత్‌రెడ్డి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన కాంతాల మల్లారెడ్డి- రజిత దంపతుల కుమారుడు కాంతాల సాయిప్రశాంత్‌రెడ్డి గ్రూప్- 2 ఫలితాల్లో 95వ ర్యాంకు సాధించాడు. సామాన్య వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయి ప్రశాంత్‌రెడ్డి గ్రూప్- 4 ఫలితాల్లో 777వ ర్యాంకుతో సత్తాచాటి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయి ప్రశాంత్‌రెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కూలీ కుటుంబం నుంచి...


మోదుంపల్లి మహేశ్వరి

మానకొండూర్: మానకొండూర్‌కు చెందిన మోదుంపల్లి మహేశ్వరి గ్రూప్-1 ఫలితాల్లో 456 మార్కులు సాధించింది. మోదుంపల్లి శంకరయ్య-శంకరమ్మ దంపతులకు కూతురు మహేశ్వరీ సంతానం. తండ్రి శంకరయ్య మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి శంకరమ్మ కూలీనాలి పనులు చేసుకుంటూ కూతురును చదివించింది.

ఆమె మాట్లాడితేనే టవర్ దిగుతా

- హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్
- మహిళ మాట్లాడటంతో కిందకు దిగిన యువకుడు


విద్యుత్ హైటెన్షన్ టవర్‌పై ఉన్న అజయ్


అజయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జ్యోతినగర్(రామగుండం): తనతో చనువుగా ఉన్న ఆమె ఇప్పుడు తనతో మాట్లాడడం లేదని, ఆమె మాట్లాడితేనే టవర్ దిగుతానని, లేదంటే దూకి ఆత్మహత్య చేసుకుంటానని బిహార్‌కు చెందిన వలసకూలీ గేదెం అజయ్ భీష్మించుకు కూర్చున్నాడు. మంగళవారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లోని హైటెన్షన్ విద్యుత్ టవర్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్, ఏసీపీ రమేశ్, సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు అధికారులు మైక్‌సెట్ ద్వారా యువకుడిని సంప్రదించగా.. కొద్దిరోజులుగా ఆ యువతి తనతో మాట్లాడడం లేదన్నారు. స్పందించిన పోలీసులు యువతిని ఘటనా స్థలానికి తీసుకొచ్చి మైక్‌లో మాట్లాడించగా, అజయ్ టవర్ దిగాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు.. అజయ్ తనను కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, పోలీసుల అప్రమత్తంగా వ్యవహరించి సదరు యువతిని సంఘటనా స్థలానికి తీసుకొచ్చి మాట్లాడించడంతో యువకుడి ప్రాణాలు దక్కాయి.

బ్లాక్ మెయిల్ చేసిన ముగ్గురి అరెస్ట్

- రూ.80వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: ఇరిగేషన్ శాఖ మెట్‌పల్లి డివిజన్‌లో డీఈఈ లక్కంపల్లి అరుణోదయ్ కుమార్‌ను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఎస్సై అనిల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. రౌడీషీటర్ బత్తుల భరత్, జెట్టి లక్ష్మణ్, రేంజర్ల అజయ్, ఎన్నం రమేశ్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా అక్రమదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసు పెడతామంటూ బెదిరిస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. గతనెల 12న రేంజర్ల అజయ్ రాజేశ్వర్‌రావుపేటలోని వరద కాలువ నుంచి అక్రమంగా మొరం తరలిస్తుండగా డీఈఈ తమ వర్క్ ఇన్స్‌పెక్టర్ లస్మయ్యతో కలిసి అక్కడకు వెళ్లి అడ్డుకున్నాడు. వెంటనే అజయ్ ఈ విషయాన్ని ఫోన్‌లో రమేశ్‌కు తెలపగా.. అతడు వచ్చి డీఈఈని దూషించడంతోపాటు అట్రాసిటీ కేసు పెట్టిస్తామని బెదిరించాడు. గత్యంతరం లేక డీఈఈ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత భరత్ డీఈఈకి ఫోన్ చేసి అట్రాసిటీ కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అలాగే జెట్టి లక్ష్మణ్ కూడా ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని, లేకుంటే చంపుతామని బెదిరించాడు. దీనికి భయపడిన డీఈఈ భరత్‌కు ఫోన్‌పే ద్వారా రూ.1.10లక్షలు, లక్ష్మణ్‌కు రూ.40వేలు నేరుగా అందించాడు. అయినా వినకుండా మిగతా డబ్బులు కూడా ఇవ్వాలంటూ తరచూ ఫోన్ చేసి బెదిరించసాగారు. వారి వేధింపులు భరించలేక డీఈఈ ఈనెల 6న ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న నలుగురిలో భరత్, లక్ష్మణ్, అజయ్‌ని జిల్లా సరిహద్దు గండి హనుమాన్ ఆలయ సమీపంలో పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.80వేలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు రమేశ్ పరారీలో ఉన్నా డు. సర్కిల్ పరిధిలో పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తూ ప్రజలను బెదిరింపులకు గురిచేయడం మానుకోవాలని, లేకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.